సాక్షి నంద్యాల

మంగళవారం ‌। 23 ‌। ఏప్రిల్ ‌। 2024



శాస్త్రోక్తంగా సహస్ర దీపార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం శాస్త్రోక్తంగా సహస్ర దీపార్చన చేశారు. ఉత్సవ మూర్తులను వెండి రథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



రూ.5 లక్షల విరాళం

శ్రీశైలంటెంపుల్: శాశ్వత అన్నదాన పథకానికి సోమవారం ఎన్‌టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన గణేష్ ట్రాన్స్‌పోర్టు అధినేత వి.వి.రామ్‌ప్రసాద్ రూ.5,01,116 విరాళాన్ని అందించారు.



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన రాగరమ్మ కల్చరల్ ఆర్గనైజేషన్ వారి సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

రేపు ఎమ్మెల్యే నాని నామినేషన్

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి (నాని) బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర జలవనరుల సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ బుధవారం ఉదయం ఆళ్లగడ్డ పార్టీ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని నామినేషన్ దాఖలు ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు.

తగ్గని భగభగలు

- మహానంది, గోస్పాడులో 45.3 డిగ్రీల ఉష్ణోగ్రత

కర్నూలు(అగ్రికల్చర్): భానుడి భగభగలు తగ్గడం లేదు. ఎండలు, వడగాలుల తీవ్రత పెరిగిపోతుండటంతో ఉమ్మడి జిల్లా ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు ప్రధాన రహదారుల్లో వాహనాల రాకపోకలు తగ్గిపోయాయి. కర్నూలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలు పాదచారుల దాహార్తి తీరుస్తున్నాయి. మహానంది, గోస్పాడులో 45.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. బనగానపల్లి, డోన్‌లలో 44.5, రుద్రవరంలో 44.3, నంద్యాల, కోడుమూరులో 44.1, ఆత్మకూరులో 44, మంత్రాలయంలో 43.6, కర్నూలులో 43.4 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల తీవ్రత పెరిగే ప్రమాదం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు తెలిపారు.

క్వింటా కందులు రూ.11,569

- వాము గరిష్ట ధర రూ.28,669

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో కందుల ధర రోజు, రోజుకు పెరుగుతోంది. సోమవారం మార్కెట్‌కు 61 మంది రైతులు 174 క్వింటాళ్ల కందులు తీసుకొచ్చారు. కనిష్ట ధర రూ.3,829, గరిష్ట ధర రూ.11,569 లభించింది. మోడల్ ధర రూ.11109 నమోదైంది. అంటే అత్యధిక లాట్లకు రూ.11వేలపైనే ధర లభించడం విశేషం. 2023–24లో వర్షాభావం వల్ల కందుల దిగుబడులు తగ్గినప్పటికీ గిట్టుబాటు ధరలు లభిస్తుండటం రైతులకు ఊరటనిస్తోంది. వాము మార్కెట్‌కు 215 క్వింటాళ్లు వచ్చింది. కనిష్ట ధర రూ.రూ.1,060, గరిష్ట ధర రూ.28,669, మోడల్ ధర రూ.17,082 లభించింది.

ఎన్నికల విధులకు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

కర్నూలు కల్చరల్: సాధారణ ఎన్నికల విధులకు సహాయ సకారాలు అందించేందుకు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను ఎంపిక చేశారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన ఆదేశాల మేరకు రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల వలంటీర్లను ఎంపిక చేసినట్లు వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.పి.నాగరాజు తెలిపారు. వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్ కుమార్ ఆదేశాల మేరకు వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు 980 మంది జాబితాను ఎన్నికల అధికారికి పంపామని తెలిపారు. వీరు వయోవృద్ధులు, దివ్యాంగులను పోలింగ్ బూత్‌ల వద్దకు తీసుకురావడం, ఓటర్లు క్యూలైన్లలో ఉండేలా చూడటం లాంటి విధుల్లో సహాయ సహకారాలు అందిస్తారని పేర్కొన్నారు.

బాలికలు అదుర్స్

- పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 88.24 శాతంతో బాలికల ముందంజ
- ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలలు
- జిల్లా వ్యాప్తంగా 23,787 మంది విద్యార్థుల్లో 20,367 మంది ఉత్తీర్ణత
- గత సంవత్సరం కంటే మెరుగైన ఫలితాలు
- 85.62 శాతం ఉత్తీర్ణతతో నంద్యాల జిల్లాకు 19వ స్థానం



నాగవైష్ణవి (596) శ్రీచైతన్య, నంద్యాల



జోత్స్న (589), మోడల్ స్కూల్, ఆళ్లగడ్డ



సుప్రజ (587) మోడల్‌స్కూల్, జూపాడుబంగ్లా



మోక్షితగౌడు (586) మోడల్‌స్కూల్, జూపాడుబంగ్లా



సమీర (583) మోడల్ స్కూల్, ఆళ్లగడ్డ



వరుణ్ (583), మోడల్ స్కూల్, పాములపాడు



నిసరుద్దీన్ (582) కేఎస్ఎం స్కూల్, నంద్యాల



సుసన జాయ్ (582), జెడ్పీహెచ్ఎస్, నందికొట్కూరు

నంద్యాల(న్యూటౌన్): విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక మార్పులతో సత్ఫలితాలు వెలువడుతున్నాయి. విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న సంస్కరణలు విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు పడ్డాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడి విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సత్తా చాటారు. సోమవారం పాఠశాల విద్య కమిషనర్ సురేష్‌కుమార్ విజయవాడ నుంచి పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదల చేశారు. నంద్యాల జిల్లాలో బాలికలు ప్రతిభ చాటారు. 2023–24 విద్యా సంవత్సరం పదో తరగతికి సంబంధించి ఈ ఏడాది మార్చి 2 నుంచి 18వ తేదీ వరకు పరీక్షలు జరిగాయి. జిల్లాలోని 451 పాఠశాలల్లోని 23,787 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 20,367 మంది ఉత్తీర్ణత సాధించారు. గతేడాదితో పోల్చితే ఫలితాల శాతం మెరుగు పడింది. 2022–23 సంవత్సరం 60.39 శాతం మంది పాస్ కాగా ఈ ఏడాది 85.62 శాతం ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా నంద్యాల జిల్లా 19వ స్థానంలో నిలిచింది. 20,367 మంది ఉత్తీర్ణత సాధించగా వారిలో ప్రథమ శ్రేణిలో 15,231 మంది, ద్వితీయ శ్రేణిలో 3,278, తృతీయ శ్రేణిలో 1,858 మంది విద్యార్థులు పాసయ్యారు. 12,283 మంది బాలలకు గాను 10,216 మంది పాస్ కాగా, 10,504 మంది బాలికలకు గాను 10,151 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలల ఉత్తీర్ణత 83.17 శాతం, బాలికలు 88.24 శాతంగా నమోదైంది. జిల్లాలో నంద్యాల మండలంలో అత్యధికంగా ఉత్తీర్ణత అయ్యారు. పట్టణం, మండలంలో మొత్తం 4,726 మంది పరీక్ష రాశారు. అందులో బాలురు 2,628 మందికి గాను 2,444 పాస్ కాగా, బాలికలు 2,098కి గాను 1,920 మంది పాస్ అయి 92.34 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో అత్యల్పంగా మిడుతూరు మండలం నిలిచింది. మిడుతూరులో 222 మంది బాలలకు గాను 134 మంది పాస్ కాగా 311 మంది బాలికలకు గాను 177 మంది పాస్ కాగా ఉత్తీర్ణత శాతం 69.11గా నమోదైంది.

98 పాఠశాలల్లో వంద శాతం

జిల్లాలోని 451 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు 98 ఉన్నాయి. జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలు కరిమద్దెల, గోవిందపల్లె, నర్సాపురం, డబ్ల్యూ కొత్తపల్లె, కోవెలకుంట్ల, అబ్దుల్లాపురం, దీబగుంట్ల, ఏపీ మోడల్ స్కూల్స్ వెలుగోడు, నంద్యాల, కేజీబీవీ పాణ్యం, వైఎస్సార్‌నగర్, శిరివెళ్ల, ఏపీఎంజేపీఏపీబీసీ డబ్ల్యూఆర్ ఈఎస్ బాలికల పాఠశాల నెరవాడ, ఆళ్లగడ్డ, ట్రైబల్ స్కూల్ శ్రీశైలం, మోడల్ పాఠశాల అవుకు, ఎయిడెడ్ పాఠశాల పెద్దకొట్టాల, హోలీక్రాస్ కెథడ్రల్ పాఠశాల నంద్యాల, సీఎస్ఐ హైస్కూల్ నంద్యాల, ఆదర్శ పాఠశాలలు బ్రాహ్మణకొట్కూరు, ప్రైవేటు పాఠశాలలు శ్రీచైతన్య ఎస్–4, గురురాజ నంద్యాల, ఎస్టీ జోసెఫ్ కోవెలకుంట్ల, ప్రియదర్శిణి బనగానపల్లె, ద్రోణాచలం హైస్కూల్ డోన్, నారాయణ ఇంగ్లీష్ మీడియం నంద్యాల, గుడ్‌షెప్పర్డ్ స్కూల్ నంద్యాల పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. జిల్లాలో జీరో శాతం మార్కులు వచ్చిన పాఠశాలలు మూడు ఉన్నాయి.

- జిల్లాలోని 15 ఎయిడెడ్ పాఠశాలల్లో 699 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా అందులో బాలురు 349 మందికి గాను 220 మంది పాస్ కాగా బాలికలు 350 మందికి గాను 284 మంది పాస్ అయ్యారు. ఎయిడెడ్ పాఠశాలలో 72.10 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు.
- 20 ఆదర్శ పాఠశాలలో 1,697 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా 875 మంది బాలురలో 818 మంది, 822 మంది బాలికల్లో 796 పాస్ అయ్యారు. 95.11శాతం మంది ఉత్తీర్ణత సాధించారు.
- జిల్లాలోని 12 ప్రభుత్వ పాఠశాలలో 1,346 మంది పరీక్షలు రాయగా 768 బాలురలో 509 మంది, 586 మంది బాలికల్లో 405 మంది పాస్ అయ్యారు. 67.90 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు.
- 27 కేజీబీవీ పాఠశాలలో 1,003 మంది విద్యార్థినిలు పరీక్ష రాయగా 884 మంది పాస్ కాగా 88.14 శాతం సాధించారు.
- నాలుగు మున్సిపల్ హైస్కూల్ 663 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 246 బాలురలో 183 మంది, 161 మంది బాలికల్లో 139 మంది పాస్ అయ్యారు. 79.12 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు.
- జిల్లాలోని బీసీ వెల్ఫేర్ పాఠశాలల్లో 301 మంది పరీక్ష రాయగా, 192 మంది బాలురలో 189 మంది, 109మంది బాలికల్లో 109 మంది ఉత్తీర్ణత సాధించగా 99 శాతం మంది పాస్ అయ్యారు.
- ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో 186 మంది పరీక్ష రాయగా, 143 మంది బాలురు, 24 మంది బాలికలు పాస్ కాగా 89.78 శాతం సాధించారు.
- ఆశ్రమ పాఠశాలలో 107 మంది విద్యార్థుల్లో 19మంది బాలురు, 66 మంది బాలికలు పాస్ కాగా, 79.44 శాతం ఉత్తీర్ణత సాధించారు.
- 180 జిల్లా పరిషత్ పాఠశాలల్లో 9,542 మందికి గాను బాలురు 4,717 మంది పరీక్షలు రాయగా 3,318 మంది పాస్ కాగా, బాలికలు 4,825మందికి గాను 3,988 మంది పాసై 76.57 శాతం ఉత్తీర్ణత సాధించారు.
- 171 ప్రైవేటు పాఠశాలల్లో 4,898 మంది బాలలు పరీక్షలు రాయగా 4,756 మంది పాస్ అయ్యారు. అదే విధంగా బాలికలు 3,148 మంది పరీక్షలకు హాజరు కాగా 3,078 మంది పాస్ అయ్యారు. 97.37 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు

- కె.సాయిచరణ్ (593), ఏపీఎంఎస్ మోడల్ స్కూల్, వెలుగోడు
- జేకే సాగర్ (592), కేఎస్ఎం మున్సిపల్ స్కూల్, నంద్యాల
- అమరేశ్వరరెడ్డి (591), జెడ్పీహెచ్ఎస్, గుండ్ల సింగవరం, అవుకు మండలం
- మహిరా (589), సెయింట్ జోషెఫ్ బాలికల ఎయిడెడ్ పాఠశాల, నంద్యాల
- దూదేకుల జుబేదాబేగం (589) బీసీ వెల్ఫేర్ పాఠశాల, నెరవాడ, పాణ్యం
- వడ్ల ఆఫ్రీన్ (585), కేజీబీవీ మైనార్టీ పాఠశాల, నంద్యాల
- మహిమరాణి (582), సోషల్ వెల్ఫేర్‌పాఠశాల, కోవెలకుంట్ల
- నిసరుద్దీన్ (582), కేఎస్ఎం పాఠశాల, నంద్యాల
- ఎస్.మహేశ్వరి (572), ప్రభుత్వ బాలికల పాఠశాల, నంద్యాల
- ఎస్. అనిల్ కుమార్ (588), బి. వెంకట రాముడు (580) మహాత్మా జ్యోతిభా పూలే బీసీ గురుకుల పాఠశాల, సున్నిపెంట
- అంజిబాబునాయక్ (574), ఏపీ ట్రైబల్ పాఠశాల, శ్రీశైలం
- ఎస్.వినీలా (565), డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కోవెలకుంట్ల

రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ నేటి నుంచి ఫీజు చెల్లింపు

పరీక్షలు రాసిన విద్యార్థులు తమ జవాబు పత్రాల రీ కౌంటింగ్ చేసుకునేందుకు రూ.500, రీ వెరిఫికేషన్ కు సంబంధించి ఒక్కో సబ్జెక్టుకు రూ.1000 ఈ నెల 23వ తేదీ నుంచి చెల్లించాలి. ఇందుకు సంబంధించి సీఎఫ్ఎంఎస్ సిటిజన్ చలాన్ తీయాలి. www.cfms.ap.gov.in అను వెబ్‌సైట్‌లో చలాన్ తీయాల్సి ఉంది. ఇందుకు సంబంధించి www.bse.ap.gov.inలో దరఖాస్తు నింపాల్సి ఉంది.

మే 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

పరీక్షలలో తప్పిన విద్యార్థులకు మే 24వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షలకు సంబంధించి ఎలాంటి రుసుం లేకుండా ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు, అపరాధ రుసుంతో మే 1వ తేదీ నుంచి 23వ తేదీ వరకు సప్లిమెంటరీ ఫీజులు చెల్లించే అవకాశం కల్పిస్తున్నారు.

రైతు కుటుంబంలో విద్యా కుసుమం



తల్లిదండ్రులతో విద్యార్థి అమరేశ్వరరెడ్డి (591)

అవుకు(కొలిమిగుండ్ల): మారుమూల గ్రామంలోని మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన రైతు బిడ్డ పదో తరగతి పరీక్షల్లో సత్తా చాటాడు. అవుకు మండలం లింగంబోడుకు చెందిన కసిరెడ్డి శివరామిరెడ్డి, రామేశ్వరమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు విశ్వనాథరెడ్డి ఇంటర్ పూర్తి చేసి ఎంసెట్‌కు కోచింగ్ తీసుకుంటున్నాడు. చిన్న కుమారుడు అమరేశ్వరరెడ్డి గుండ్లశింగవరం ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాడు. ప్రతి రోజు లింగంబోడు నుంచి 1.6 కి.మీ కాలినడకన ప్రధాన రహదారి వద్దకు చేరుకొని అక్కడి నుంచి బస్సులో గుండ్లశింగవరం పాఠశాలకు వెళ్లేవాడు. సోమవారం విడుదలైన ఫలితాల్లో 591 మార్కులు సాధించాడు. ఇంటర్‌లో ఎంపీసీ తీసుకొని తర్వాత ఐఐటీ పూర్తి చేస్తానంటున్నాడు. సివిల్స్‌కు సెలెక్ట్ కావాలని లక్ష్యంగా చదువుతానని చెబుతున్నాడు. తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో అత్యధిక మార్కులు సాధించగలిగానని అమరేశ్వరరెడ్డి సంతోషం వ్యక్తం చేశాడు.

శభాష్ శ్రావ్యశ్రీ



తల్లిదండ్రులతో శ్రావ్యశ్రీ (591)

మిడుతూరు: నందికొట్కూరు పట్టణంలోని నాగరాజు, గౌరిదేవి దంపతుల రెండో కుమార్తె శ్రావ్యశ్రీ ఆదర్శ పాఠశాలలో పదో తరగతిలో 591 మార్కులు సాధించి అందరి నుంచి అభినందనలు అందుకుంటోంది. శ్రావ్యశ్రీ తండ్రి నాగరాజు పట్టణంలో అవుట్ సోర్సింగ్‌లో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇంటర్ బైపీసీ తీసుకొని మెడిసిన్‌లో ర్యాంకు సాధించి వైద్య వృత్తిలో రాణిస్తానని శ్రావ్యశ్రీ చెబుతోంది.

పేదింట మెరిసిన ఆణిముత్యం



తల్లిదండ్రులతో మహిమారాణి (582)

కోవెలకుంట్ల: కంపమల్ల గ్రామానికి చెందిన మహిమారాణి పది ఫలితాల్లో సత్తా చాటింది. గ్రామానికి చెందిన శ్రీరాముల ప్రతాప్, ఎలిజబెత్ దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. తనకున్న మూడు ఎకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ, 2020 సంవత్సరం నుంచి ఇంటింటికి రేషన్ సరఫరా చేసే ఎండీయూ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. కుమారుడు కాంతికుమార్ తిరుపతిలో అగ్రికల్చర్ బీఎస్సీ చదువుతున్నాడు. కుమార్తె మహిమారాణి కోవెలకుంట్ల పట్టణంలోని గురుకుల పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసింది. సోమవారం విడుదలైన ఫలితాల్లో 582 మార్కులు సాధించింది. ఎంబీబీఎస్ చేసి డాక్టర్‌గా పేద ప్రజలకు వైద్య సేవలందించాలన్నదే తన ముందున్న లక్ష్యమని మహిమారాణి చెబుతోంది.

ఐఏఎస్ లక్ష్యంగా చదువుతా



పదవ తరగతి పరీక్షల్లో 600కు 593 మార్కులు సాధించేందుకు వెలుగోడు ఏపీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సహకారం ఎంతో ఉంది. మోడల్ స్కూల్ విద్యాభ్యాసంతో నా జీవితం మారిపోయింది. మా నాన్న చంద్రుడు ప్రైవేటు కళాశాల లెక్చరర్‌గా పని చేస్తూ చదువులో నన్ను ఎంతో ప్రోత్సహించారు. ప్రణాళికతో చదివితే ఉత్తమ మార్కులు సాధించవచ్చు. భవిష్యత్తులో ఐఏఎస్ కావాలన్నదే నా లక్ష్యం.

– సాయిచరణ్, ఏపీ మోడల్ స్కూల్, వెలుగోడు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువులు బాగున్నాయి



మున్సిపల్ పాఠశాలలో కూడా మంచి చదువులు చెబుతున్నారనేందుకు నా మార్కులే నిదర్శనం. కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నాకు 592 మార్కులు రావడం ఆనందంగా ఉంది. మా నాన్న శేషఫణి కిరాణ షాపు నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వారి కష్టం వృథా కాకుండా ఉన్నత చదువులు అభ్యసించి మంచి ఉద్యోగం సాధిస్తా.

– జేకే సాగర్, కేఎస్ఎం మున్సిపల్, నంద్యాల

నిఘా మరింత పెంచాలి

- అడిషనల్ ఎస్పీ నాగరాజు

కర్నూలు: మద్యం, నగదు, కానుకల అక్రమ రవాణాను అరికట్టేందుకు సెబ్, ఎక్సైజ్, ఎన్నికల టాస్క్‌ఫోర్స్ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేయాలని అడిషనల్ ఎస్పీ నాగరాజు ఆదేశించారు. చెక్‌పోస్టుల్లో నిఘా మరింత పెంచాలన్నారు. సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబుతో పాటు జిల్లాలోని 7 సెబ్ స్టేషన్లు, 7 ఎక్సైజ్ చెక్‌పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్, మోడల్ కండక్ట్ టీమ్ అధికారులతో సమన్వయ సమావేశం సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగింది. మద్యం, సారా అక్రమ రవాణాలో ఆరు నెలల్లోపు వరుసగా మూడుసార్లు పట్టుబడి కేసులు నమోదైనవారి జాబితాను తయారు చేసి ఎస్పీ ద్వారా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాలని ఏఎస్పీ సెబ్ అధికారులకు సూచించారు. జిల్లా బహిష్కరణకు 26 మంది జాబితాను సిద్ధం చేసినట్లు సెబ్ అధికారులు వెల్లడించారు. అలాగే పీడీ చట్టం నమోదుకు ఒకరి పేరు ప్రతిపాదన పంపినట్లు తెలిపారు. సీఐలు వాసుదేవ చౌదరి, చంద్రహాస్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న డోన్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ పోచా



కుటుంబ సభ్యులతో కలసి నామినేషన్ వేసేందుకు వస్తున్న పాణ్యం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పచ్చ కండువా తీసేస్తే అభివృద్ధి కనిపిస్తుంది

- హత్యా రాజకీయాలను ప్రజలు ఇంకా మరువలేదు
- ఏమి చేశారని ప్రజలను ఓట్లు అడుగుతున్నారు
- టీడీపీ అభ్యర్థి కోట్లపై మంత్రి బుగ్గన ఆగ్రహం



నామినేషన్‌కు భారీగా తరలివచ్చిన జనం



ప్రసంగిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: పచ్చ కండువా కప్పుకున్నందుకే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డికి పచ్చ కామెర్లు సోకి డోన్‌లో జరిగిన అభివృద్ధి కనిపించడం లేదని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కోట్ల కుటుంబాన్ని నమ్ముకుని వేలాది కుటుంబాలు బలైన సంగతిని కోట్ల మరిచిపోవడం విచారకరమన్నారు. సోమవారం డోన్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం పాతబస్టాండ్‌లో జరిగిన అశేష ప్రజావాహిని ఉద్దేశించి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో కోట్ల, కేఈ వర్గీయుల ఆధిపత్య పోరుకు వందలాది మందిని బలి తీసుకొని వారి భార్యలను వితంతువులను చేశారని బుగ్గన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ రెండు కుటుంబాలను అనేక ఎన్నికల్లో గెలిపించి అందలం ఎక్కించినా ప్రజల సమస్యలను పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సబ్ కోర్టు, టీటీడీ కల్యాణ మండపం, రెవెన్యూ డివిజన్, హైవేపై రూ.70 కోట్లతో ఫ్లైఓవర్లు, సర్వీస్ రోడ్లు నిర్మించామన్నారు. రూ.3వేల కోట్లతో పులివెందుల తర్వాత రాష్ట్రంలో నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు.

కోట్లను రాజకీయాలకు దూరం చేసేందుకు..

గత రెండు ఎన్నికల్లో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చేతిలో దారుణంగా ఓటమిపాలైన కేఈ కుటుంబీకులు ఈ ఎన్నికల్లో కోట్ల కుటుంబాన్ని బలిపశువును చేయాలనుకుంటున్నారని గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్నకేశవయ్యగౌడ్ విమర్శించారు. వారి కుటుంబంలాగే కోట్ల కుటుంబం కూడా పరాజయ భారంతో రాజకీయాలకు దూరం కావాలని కేఈ కుటుంబీకులు వేసిన ఎత్తుగడ అన్నారు. సమావేశంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, వైఎస్ఆర్‌సిపి నాయకులు బోరెడ్డి పుల్లారెడ్డి, బుగ్గన సంజీవరెడ్డి, జెడ్పీటీసీ రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్లు సప్తశైల రాజేష్, చలంరెడ్డి, నాయకులు గూని నాగరాజు పాల్గొన్నారు.

నామినేషన్ల జోరు

- అట్టహాసంగా నామినేషన్లు వేసిన మంత్రి బుగ్గన, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- నామినేషన్లకు మరో రెండు రోజులే గడువు



పాణ్యం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన జనం

సాక్షి, నంద్యాల: జిల్లాలో నామినేషన్ల పర్వం జోరుగా సాగుతోంది. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేస్తూ, ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. ఈ నెల 18వ తేదీన సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. అదే రోజు నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. తొలిరోజే శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా వైఎస్సార్‌సీపీ నుంచి శిల్పా చక్రపాణిరెడ్డి, టీడీపీ నుంచి బుడ్డా రాజశేఖర రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సర్వమత ప్రార్థనలు చేసిన అనంతరం ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డికి తన నామినేషన్ పత్రాలను అందజేశారు. పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థిగా కాటసాని రాంభూపాల్ రెడ్డి కర్నూలులోని తన స్వగృహం నుంచి కర్నూలు కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి కుటుంబ సభ్యులతో కలిసి నామినేషన్ వేశారు. అలాగే టీడీపీ నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, నందికొట్కూర్ టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య, ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిల ప్రియ నామినేషన్ దాఖలు చేశారు. ఈ నెల 25వ తేదీతో నామినేషన్ల గడువు ముగియనుంది. దీంతో అభ్యర్థులు మంచి రోజు, ముహూర్తం చూసుకుని నామినేషన్ వేస్తున్నారు. నామినేషన్ల ప్రక్రియలో భాగంగా 24వ తేదీ భారీ ఎత్తున నామినేషన్లు దాఖలు కానున్నాయి. వైఎస్సార్‌సీపీ నంద్యాల ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డితో పాటు బనగానపల్లె, నందికొట్కూరు అభ్యర్థులు కాటసాని రామిరెడ్డి, డాక్టర్ దారా సుధీర్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇప్పటి వరకు నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గానికి తొమ్మిది మంది నామినేషన్లు వేశారు. ఆళ్లగడ్డకు నలుగురు, బనగానపల్లెకు ఐదుగురు, డోన్ నుంచి ఐదుగురు, నంద్యాల నుంచి 10 మంది, పాణ్యం నుంచి ఐదుగురు, నందికొట్కూరు నుంచి 8 మంది, శ్రీశైలం నుంచి 11 మంది ఇప్పటి వరకు నామినేషన్లు వేశారు.

నాలుగో రోజు 25 మంది అభ్యర్థులు

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సోమవారం నామినేషన్ల కోలాహలం కొనసాగింది. మొదటి మూడు రోజులు మందకొడిగా సాగిన నామినేషన్ల ప్రక్రియ చివరి తేదీ దగ్గర పడటంతో ఊపందుకుంది. మంచి రోజు కోసం వేచి చూస్తున్న అభ్యర్థులు నామినేషన్ చివరి తేదీ 25న కావడంతో తమ ఆస్తుల వివరాలు, కేసుల వివరాలు తెలుసుకొని నామినేషన్లు వేస్తున్నారు. సోమవారం ఎంపీ స్థానానికి ఆరుగురు, అసెంబ్లీ నియోజకవర్గాలకు 19 మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలను సంబంధిత పార్లమెంట్, అసెంబ్లీ నియోజ కవర్గ రిటర్నింగ్ అధికారులకు అందజేశారు.

క్లుప్తంగా

క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్



బెట్టింగ్‌రాయుళ్ల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ఆదోని అర్బన్: ఐపీఎల్–2024 సందర్భంగా క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2.50 లక్షలు నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఆదోని పట్టణం ఎమ్మిగనూరు బైపాస్ వద్ద కల్వారి కొండ సమీపంలో ముళ్లకంపల చెట్ల కింద క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తుండగా ఆదోని పట్టణం మరాఠీగేరికి చెందిన మహానంది, రమేష్, ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన షహీద్, ఆదోని పట్టణం కార్వన్‌పేటకు చెందిన బెస్త వినోద్‌లను అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.2.50 లక్షలు నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. జల్సాల కోసం వీరు క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. త్రీటౌన్ సీఐ నరసింహరాజు, పోలీసు సిబ్బంది లక్ష్మన్నస్వామి, నరేంద్ర, పరశురామ్, పరమేష్, గిరిబాబు, నరసింహులు, ఇస్మాయిల్‌లు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ ఎల్ఎల్‌సీ కాలువ సమీపంలో ఆదివారం రాత్రి బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో బోయ లక్ష్మన్న (28) మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. గుడేకల్‌కు చెందిన లక్ష్మన్న, భార్య నారాయణమ్మ పుట్టినిళ్లైన పెద్ద కడబూరు మండలం హనుమాపురానికి వెళ్లింది. లక్ష్మన్న ఆదివారం రాత్రి టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై భార్య వద్దకు వెళ్తుండగా ఆదోని వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. బైక్ రోడ్డు పక్కనున్న ముళ్ల పొదల్లో పడగా లక్ష్మన్న గుంతలో పడిపోయాడు. ఢీకొట్టిన వ్యక్తి కారును వదిలి పారిపోయాడు. సోమవారం ఉదయం ఆ మార్గంలో వెళ్లిన వారు బైక్‌ను గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా లక్ష్మన్న మృతదేహం కనిపించింది. మృతుడి భార్య నారాయణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

పర్యావరణాన్ని విస్మరిస్తే భవిష్యత్ అంధకారం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ డీన్ రామగోపాల్

కోవెలకుంట్ల: ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో వాతావరణ కాలుష్యం నుంచి పర్యావరణాన్ని కాపాడుకోకపోతే భవిష్యత్ అంధకారమంతుందని శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ డీన్ (కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్), భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రామగోపాల్ అన్నారు. స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అధ్యక్షతన జాతీయ సెమినార్ కార్యక్రమం నిర్వహించారు. భౌతికశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో ఎన్విరాన్మెంటల్ పొల్యూషన్, సస్టెయినబుల్ మెటీరియల్స్ అనే అంశాలపై జరిగిన సెమినార్ కార్యక్రమంపై ఆయన విద్యార్థులనుద్దేశించి ఆయన ప్రసగించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని సూచించారు. వాతావరణ కాలుష్యం వల్ల ఓజోన్ పొర దెబ్బతిని ప్రజానీకానికి, వ్యవసాయ రంగానికి హాని జరుగుతోందన్నారు. కార్యక్రమంలో నంద్యాల ఆర్‌జీఎం ఇంజనీరింగ్ కళాశాల భౌతిక శాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ జమాలయ్య, బళ్లారి ప్రభుత్వ డిగ్రీ,పీజీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ నర్సింహులు, కళాశాల అధ్యాపకులు దాసు, రామసుబ్బారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి,భాస్కర్‌రెడ్డి,క్రిష్ణశశాంక పాల్గొన్నారు.

మంచి పాలనకే 'తొలి' ఓటు!

- నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకుంటాం
- ప్రలోభాలకు ఎట్టి పరిస్థితుల్లో లొంగం
- పాలకులు మంచి వారైతే రాష్ట్రం, దేశం బాగుపడుతుంది
- తొలిసారిగా ఓటు వేయబోతున్న యువత మనోగతం



కర్నూలు(అగ్రికల్చర్): మంచి పాలన అందించే వారికే తాము ఓటు వేస్తామని తొలిసారిగా ఓటు హక్కు పొందిన యువతీ, యువకులు చెబుతున్నారు. పాలకులు మంచి వారైతే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని, ఇలాంటి వారినే తాము ఎన్నుకుంటామని పేర్కొంటున్నారు. కర్నూలు జిల్లాలో 20.14 లక్షలు, నంద్యాల జిల్లాలో 13.94 లక్షలు.. మొత్తం 34.08 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 18, 19 ఏళ్ల యువత 1,71,215 మంది ఉన్నారు. అయితే ఇందులో 87,285 మంది ఓటర్లుగా నమోదయ్యారు. మే నెల 13న నిర్వహించే శాసనసభ, లోకసభ ఎన్నికల్లో కర్నూలు జిల్లాలో 49,741, నంద్యాల జిల్లాలో 37,844 మంది మొదటి సారిగా ఓటు వేయనున్నారు. ప్రలోభాలకు లొంగకుండా నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకుంటామని వీరు స్పష్టం చేస్తున్నారు. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చే వారిని, అభివృద్ధి చేసేవారని గెలిపిస్తామని చెబుతున్నారు.

ఈ సారి పెరగనున్న ఓటింగ్ శాతం..

18–19 ఏళ్ల యువత ఓటర్లుగా నమోదయ్యేందుకు జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఇంజినీరింగ్, ఇతర వృత్తి విద్యాసంస్థలు, యూనివర్సిటీల్లో ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సారి ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచే విధంగా ఎన్నికల కమిషన్ పిలుపు నిస్తోంది. ఇందులో భాగంగా స్వీప్ కార్యక్రమాలను అధికారులు పెద్ద ఎత్తున చేపడుతున్నారు. 2019 వరకు జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే ఓటింగ్‌కు 50 శాతం వరకు యువత దూరంగా ఉంటోంది. ఈ సారి ఎన్నికల్లో 80 శాతం ఓటింగ్ ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

నియోజకవర్గాల వారీగా యువ ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి..

నియోజక వర్గం	18–19 ఏళ్ల యువ ఓటర్లు
కర్నూలు	6,425
పాణ్యం	8,250
పత్తికొండ	5,678
కోడుమూరు	5,947
ఎమ్మిగనూరు	6,483
మంత్రాలయం	5,429
ఆలూరు	5,749
శ్రీశైలం	8,349
నంద్యాల	6,709
బనగానపల్లె	6,402
ఆదోని	5,510
ఆళ్లగడ్డ	5,247
డోన్	5,488
నందికొట్కూరు	5,609
మొత్తం	87,275

ఓటు తప్పకుండా వేస్తా



నేను బీటెక్ పూర్తి చేసి ప్రస్తుతం బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాను. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటరుగా నమోదు అయ్యేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాను. దరఖాస్తును ఆమోదించి ఓటరుగా నమోదు చేశారు. స్మార్ట్ ఎపిక్ కార్డు కూడా వచ్చింది. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో నాకు ఓటు లభించింది. పోలింగ్ రోజు ఎన్ని పనులున్నా.. ఓటు తప్పకుండా వేస్తాను. స్వేచ్ఛగా, నిర్భయంగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకుంటాను.

– పి.లక్ష్మిచేతన రెడ్డి, వీసస్ కాలనీ, కర్నూలు

యువత పాత్ర కీలకం



నేను పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో మూడో సంవత్సరం బీటెక్ చేస్తున్నాను. 2023లో ఓటరుగా నమోదు అయ్యేందుకు దరఖాస్తు చేసుకున్నాను. అధికారులు నా దరఖాస్తును ఆమోదించారు. ఎపిక్ కార్డు కూడా వచ్చింది. మొదటి సారిగా పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోబోతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. మంచి పాలకులను ఎన్నుకోవడంలో యువత పాత్ర కీలకం. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా అందరూ స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి.

– వినీల భూవని, కృష్ణానగర్, కర్నూలు

స్నేహితులతో కూడా ఓటు వేయిస్తా



ప్రస్తుతం నేను ఎంబీబీఎస్ 2వ సంవత్సరం చదువుతున్నాను. ఓటు హక్కును పొందేందుకు దరఖాస్తు చేసుకోవడంతోనే అమోదించి ఓటరుగా నమోదు చేశారు. ఆలూరు నియోజకవర్గంలో నా ఓటు నేను స్వేచ్ఛగా వినియోగించుకుంటాను. పాలకులు మంచివారైతే రాష్ట్రం బాగుపడుతుంది. దేశ, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఓటువేస్తాను. మొదటి సారిగా ఓటు వేయబోతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. నేను ఓటు వేస్తా... నా స్నేహితులతో కూడా ఓటు వేయిస్తాను.

– గుర్రం చేతన లాస్య, చాణుక్యపురి కాలనీ, కర్నూలు

రైతులకు వడ్డీతో రూ.3 కోట్లు చెల్లించాల్సిందే

- బీమా సంస్థకు వినియోగదారుల కమిషన్ ఆదేశం

కర్నూలు (లీగల్): గోడౌన్‌లో దాచుకున్న పంట షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన ఘటనలో 25 మంది రైతులకు నష్టపరిహారం చెల్లించాల్సిందేనని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ తేల్చిచెప్పింది. గోడౌన్ యజమాని కావాలనే రైతులు దాచుకున్న పంటను కాల్చివేశారన్న అనుమానంతో పరిహారం తిరస్కరించడాన్ని తప్పుబట్టింది. గోడౌన్ యజమానే కాల్చివేశారనడానికి ఎటువంటి ఆధారాలను ఇన్సూరెన్స్ కంపెనీ సమర్పించలేదని స్పష్టం చేసింది. 25 మంది రైతులకు రూ.3 కోట్లు పరిహారం 2018 నుంచి 9 శాతం వడ్డీతో చెల్లించాల్సిందేనని యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీని ఆదేశించింది. ఈ మేరకు కమిషన్ అధ్యక్షులు కె.కిషోర్‌కుమార్, సభ్యులు ఎస్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్‌లతో కూడిన బెంచ్ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళ్తే... నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం కరివేనలోని శ్రీసాయి లక్ష్మి రూరల్ గోడౌన్‌లో సమీప గ్రామాలకు చెందిన 25 మంది కంది పప్పు, జొన్న, మినుములు, శనగపప్పు పంటను జులై 2017లో ఏడాది పాటు నిల్వ చేసుకునేందుకు ఒప్పందం చేసుకున్నారు. 2018 జులై 4న గోడౌన్‌లో అగ్నిప్రమాదం జరిగి దాదాపు 80 శాతం పంట కాలిపోయింది. ఈ గోడౌన్‌కు యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీకి చెందిన రూ.18 కోట్ల విలువైన నాలుగు బీమా పాలసీలు ఉన్నాయి. పరిహారం చెల్లించాలంటూ గోడౌన్ యజమాని, రైతులు బీమా కంపెనీని ఆశ్రయించినా ఫలితం లేదు. దీంతో జిల్లా వినియోగదారుల కమిషన్‌లో కేసులు దాఖలు చేయడంతో పై విధంగా ఆదేశాలు ఇచ్చింది.

వైద్య విద్యార్థుల హాస్టల్‌లో ఇతరులు

- సూపరింటెండెంట్ తనిఖీలో బహిర్గతం



హాస్టళ్లను తనిఖీ చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పీజీ హాస్టల్, హౌస్‌సర్జన్ హాస్టల్స్‌లో ఇతరులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సోమవారం ఆయా హాస్టల్స్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి వైద్య విద్యార్థుల గురించి ఆరా తీశారు. ఈ సమయంలో అక్కడ వైద్య విద్యార్థులు కాకుండా ఇతరులు ఉంటున్నట్లు గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనధికారికంగా వసతి గృహాల్లో ఉంటున్న వారి వివరాలు సేకరించి వెంటనే వారు ఖాళీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎస్ఆర్ఎంవోను ఆదేశించారు. హౌస్‌సర్జన్ క్వార్టర్స్ దగ్గర పార్కింగ్ స్థలంలో వాహనాలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్వార్టర్స్‌కు ఎవరు వస్తున్నారన్న విషయాలపై నిఘా పెట్టాలని సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రిలోని పారిశుద్ధ్య సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ ఆసుపత్రి ఆవరణలో పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ సూపర్‌వైజర్లను ఆదేశించారు. ఆయన వెంట సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, ఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్ ఉన్నారు.

లారీ డ్రైవర్ సజీవ దహనం



ఆగి ఉన్న లారీని ఢీకొన్న ట్యాంకర్

ఆస్పరి: మండలంలోని చిన్నహోతూరు గ్రామం దగ్గర ఆదివారం అర్ధరాత్రి ఆగి ఉన్న లారీని సిమెంట్ తరలిస్తున్న ట్యాంకర్ ఢీకొట్టిన ఘటనలో డ్రైవర్ నజీర్ (32) సజీవ దహనం అయ్యారు. సోమవారం ఆస్పరి సీఐ హనుమంతప్ప చెప్పిన వివరాలు మేరకు.. ఆదివారం రాత్రి బళ్లారి నుంచి సిమెంట్ చిప్స్ లోడుతో వస్తున్న లారీ డ్రైవర్ చిన్నహోతూరు గ్రామం దగ్గర ఆపారు. బళ్లారి నుంచి హైదరాబాద్‌కు సిమెంట్ లోడుతో వెళ్తున్న ట్యాంకర్ ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో ట్యాంకర్ క్యాబిన్‌లోని నుంచి క్షణాల్లో మంటలు చెలరేగాయి. డ్రైవర్ నజీర్ కేకలు వేయడంతో గ్రామస్తులు, అటు వైపు వస్తున్న వాహనాల డ్రైవర్లు అప్రమత్తమయ్యారు. క్యాబిన్‌లో ఇరుకున్న డ్రైవర్‌ను తీసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. కళ్ల ముందే డ్రైవర్ సజీవ దహనమయ్యారు. ఈ దృశ్యాన్ని చూసిన గ్రామస్తులు చలించిపోయారు. ఆస్పరి సీఐ హనుమంతప్ప ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆలూరు నుంచి అగ్ని మాపక దళ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. మృతదేహాన్ని ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం తరువాత బంధువులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. మృతి చెందిన నజీర్‌ది హర్యానా రాష్ట్రం కాగా.. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

- టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ తండ్రి, పారిశ్రామికవేత్త, బీజేపీ నాయకుడు టీజీ వెంకటేష్‌కు సంబంధించిన శ్రీరాయలసీమ అల్కాలీస్ పరిశ్రమకు చెందిన బ్యాంకు ఖాతా నుంచి XXXXXX680523 నెంబర్ గల ఖాతాకు మార్చి 8న రూ.1,500 జమ అయ్యింది.
- టీజీ భరత్ కుటుంబానికి చెందిన గౌరీగోపాల్ హాస్పిటల్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యాంకు ఖాతా నుంచి XXX0523నెంబర్ గల ఖాతాకు ఏప్రిల్ 6న రూ.5 వేలు జమ అయ్యింది..
- ఈ రెండే కాదు.. ఎన్నికల వేళ కర్నూలు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ గుట్టుగా డబ్బు పంపిణీ చేస్తూ కుల సంఘాల నాయకులను, ప్రజలను ప్రలోభపెడుతున్నట్లు తెలుస్తోంది. ఓటమి భయంతో డబ్బును ఎరగా చూపి ప్రలోభపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడు. కులాల వారీగా సంఘాల నాయకులను చేరదీసి కొంతమందికి రూ.15 వేల నుంచి రూ.20 వేలు ముట్టజెప్పి మద్దతు కోరుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

హమ్మ.. టీజీ!

ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి టీజీ విచ్చలవిడి ఖర్చు

- గౌరీగోపాల్ ఆసుపత్రి, రాయలసీమ ఆల్కలీస్ ఫ్యాక్టరీ ఖాతాల నుంచి డబ్బు పంపిణీ
- రూ.1,500 నుంచి రూ.5 వేల వరకూ నగదు బదిలీ
- ఎన్నికల కమిషన్ కళ్లుగప్పి వ్యవహారం
- భరత్ జన్మదిన వేడుకకు రూ.5కోట్లు ఖర్చు

రెండుసార్లు ఓటమి చెందాం.. సాయం చేయండి..

టీజీ భరత్ తరపున ఆయన తండ్రి టీజీ వెంకటేష్ నగరంలోని ప్రముఖులను పలు రాజకీయ పార్టీల నాయకులు, కులసంఘాలు, ఉద్యోగ సంఘాలు, న్యాయవాదులను పిలిపించి రహస్యంగా మంతనాలు జరుపుతున్నారు. మీరు ఏ పార్టీలో ఉన్నా పర్వాలేదు. రెండుసార్లు ఓడిపోయాం.. ఈసారి కూడా ఓడిపోతే రాజకీయంగా భవిష్యత్తు ఉండదు. ఎలాగైనా సాయం చేయండి.. మీకు ఏ విధమైన సాయం కావాలన్నా చేస్తామంటూ ప్రాధేయపడుతున్నట్లు సమాచారం. వార్డుల్లో ఒకస్థాయి నాయకుడిని కూడా వదలకుండా తన కార్యాలయానికి పిలిపించుకుని అంతో ఇంతో ముట్టజెప్పి తన కొడుకును గట్టెక్కించాలని ప్రాధేయపడుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గతంలో టీజీ వెంకటేష్ దగ్గర కనీసం 70 మందికి పైగా ముఖ్యమైన వ్యక్తులు ఎళ్లవేళలా కుటుంబాన్ని అంటిపెట్టుకుని ఉండేవారు. టీజీ భరత్ వ్యవహారశైలి నచ్చక చాలామంది దూరంగా ఉంటున్నారు. అలాంటి వారందరినీ కూడా టీజీ వెంకటేష్ పిలిపించి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నప్పటికీ భరత్‌తో కలసి పని చేయడానికి ముందుకు రాని పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది.

బర్త్‌డే గిఫ్ట్ పేరుతో ఓటర్లకు వల

2014, 2019 రెండు సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి చెందిన టీజీ కుటుంబానికి రానున్న 2024 ఎన్నికలు అత్యంత కీలకం. ఆ ఎన్నికల్లో పరాభవం చెందితే 'హ్యాట్రిక్' ఓటముల దెబ్బకు రాజకీయాల నుంచి టీజీ ఫ్యామిలీ దూరమయ్యే పరిస్థితి నెలకొంది. దీంతో ఎలాగైనా నియోజకవర్గంలో తనకు బలముంది, ప్రజల మద్దతు ఉందని చూపించేందుకు భరత్ తన బర్త్‌డేను వేదికగా చేసుకున్నారు. బర్త్‌డేకు జనం రారని ముందే ఊహించి తన అనుచరులతో ఇంటింటికీ తిరిగి గిఫ్ట్ కూపన్లు పంపిణీ చేయించారు. ఎస్టీబీసీ కళాశాల మైదానంలో వచ్చిన వారందరికీ విందుతో పాటు రూ.700 విలువ చేసే గిఫ్టులు పంపిణీ చేసి ఎన్నికల్లో సహకరించాలని కోరడం అప్పట్లో చర్చనీయాంశమైంది.

– కర్నూలు


జయ నాగేశ్వర రెడ్డిపై క్రిమినల్ కేసులు

కర్నూలు(సెంట్రల్): ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి జయనాగేశ్వరరెడ్డిపై ఐదు క్రిమినల్ కేసులు విచారణలో ఉన్నాయి. నామినేషన్ వేసిన సమయంలో అఫిడవిట్‌లో ఈ అంశాలను ఆయన పొందుపరిచారు. వ్యాపార లావాదేవీల్లో తీసుకొన్న సొమ్ము తిరిగి ఇవ్వలేదని, బ్లాంక్ చెక్‌లతో బురిడీ కొట్టించాడంటూ చిత్తూరు జిల్లాకు చెందిన సుబ్రమణ్యం అనేవ్యక్తి(సీసీ197/2019) చిత్తూరు కోర్టులో బి.జయనాగేశ్వరరెడ్డిపై చెక్‌బౌన్స్ కేసువేశారు. ఆ కేసు విచారణలో ఉంది. ఇదే కేసులో తప్పుడు సమాచారం ఇచ్చారని బాధితుడు శ్రీకాళహస్తి వన్ టౌన్ పీఎస్‌లో జయనాగేశ్వరరెడ్డిపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో ఎంబీబీఎస్ చదివినట్లు తప్పుడు అఫిడవిట్ సమర్పించాడంటూ టీడీపీకే చెందిన మాజీకౌన్సిలర్ కోనేరు నాగేంద్రప్రసాద్ కేసు (ఆర్‌పీ నెం.9/2018 ఐపీసీ సెక్షన్ 506,499,500, 120ఏ) వేశారు. ప్రస్తుతం ఈ కేసు ఆదోని కోర్టు లో విచారణలో ఉంది. ఎమ్మిగనూరు టౌన్ పీఎస్‌లో ఆయనపై (క్రైం నంబర్ 358/2021) బైండోవర్ కేసు నమోదైంది. ఈ కేసులో ఆయనను అరెస్టు చేయాలని కూడా ఎన్నికల కమిషన్ ఆదేశించింది. చిత్తూరు టూటౌన్ అర్బన్ పీఎస్‌లో చీటింగ్ కేసు నమోదైంది. 417, 420,120బీ,193,194,467,468, 156 సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. అలాగే ఆయన పేరిట రూ.13.59 లక్షల విలువ చేసే 200 గ్రాముల బంగారం అభరణాలు, భార్య బైరెడ్డి నిత్యాదేవి పేరిట రూ. 40.77 లక్షల విలువ చేసే 600 గ్రాముల బంగారుఅభరణాలు ఉన్నాయి. వీరికి ఒక కారు ఉన్నట్లు ఆఫిడవిట్‌లో చూపారు.

పొలాలు.. ఇళ్లే సాయిప్రసాద్‌రెడ్డి ఆస్తులు

ఆదోని అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వై.సాయిప్రసాద్‌రెడ్డికి వంశపార్యపరంగా వస్తున్న పొలాలు.. ఇళ్లే ఆస్తులుగా ఉన్నాయి. సోమవారం ఆయన నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా సమర్పించిన అవిడవిట్‌లో తన ఆస్తులు, ఇతర వివరాలను వెల్లడించారు. ఆయనకు అనంతపురం జిల్లా కొనకొండ్ల, మంత్రాలయం మండలం రాంపురం, కాశాపురంలలో 39 ఎకరాల వ్యవసాయ భూమి, ఆదోనిలో ఒక ఇల్లు ఉంది. అలాగే తన భార్య వై.శైలజ పేరిట కూడా కొనకొండ్ల, ఆదోనిలోని మండగిరి, 9.47 ఎకరాల భూమి, ఆదోని, నంద్యాల, కసాపురం, మండిగిరిలలో నాలుగు ప్లాట్లు, ఆదోనిలో ఒక్క ఇల్లు, కర్నూలులో టీజీ షాపింగ్ మాల్‌లో 1551 చదరపు అడుగుల ప్లాట్ ఉంది. మొత్తంగా ఆయన పేరిట చరాస్తిరాస్తులు రూ. 4.22 కోట్లు ఉండగా, ఆమె పేరిట రూ. 5.99 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. అంతేకాక ఆయన పేరిట రూ.15 లక్షల విలువ చేసే 25 తులాల బంగారు అభరణాలు, రూ.3 లక్షల విలువ చేసే వెండి ఉంది. ఆమె పేరిట రూ.57 లక్షల విలువ చేసే 96 తులాల బంగారు, 3.75 లక్షల విలువ చేసే 5 కేజీల వెండి ఉంది. వీరి కుటుంబానికి ఎలాంటి వాహనం లేదు. అంతేకాక సాయిప్రసాద్‌రెడ్డి పేరిట రూ.1.22 కోట్లు, భార్య పేరిట రూ. 44.39 లక్షల అప్పులు ఉన్నాయి.

నేడు తర్తూరు రంగనాథుడి రథోత్సవం




ప్రభోత్సవ వాహనాన్ని తిప్పుతున్న భక్తులు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీ లక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం నిర్వహిస్తున్నారు. ఉత్సవాన్ని తిలకించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు భారీగా తరలిరానున్నారు. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈఓఏడీ వెంకటరమణ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి గజవాహనంతో అలంకరించిన ప్రభోత్సవ రథంపై కొలువుంచారు. అనంతరం గ్రామోత్సవంలో ప్రజలు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వైఎస్సార్‌సీపీకే ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు

- ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు బ్రహ్మయ్య మాదిగ వెల్లడి



మాట్లాడుతున్న బ్రహ్మయ్య మాదిగ

కర్నూలు(టౌన్): ఈ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బ్రహ్మయ్య మాదిగ తెలిపారు. సోమవారం స్థానిక అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్‌లోని ఆ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల పాటు తన్ని తగలేసిన చంద్రబాబు వంచన చేరిన మందకృష్ణ మాదిగ ఆయనకు ఎంతకు అమ్ముడుపోయాడో ప్రజలకు తెలపాలన్నారు. రోడ్ల మీద తిట్టి ఇంట్లో కాళ్లు పట్టుకునే నైజం మందకృష్ణదన్నారు. చంద్రబాబు నెంబర్ వన్ మోసగాడు అని, ప్రాణహాని ఉందని చెప్పి ఇప్పుడు ఆయన చెంతకు చేరడం వెనుక రహస్య ఒప్పందం ఏంటని ప్రశ్నించారు. మాదిగ కులాలను రాజకీయ పార్టీలకు తాకట్టు పెట్టే నీచ సంస్కృతి ఆయనదన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీలు, దళిత వర్గాలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి వారికి అండగా నిలిచారన్నారు. మాదిగలు జగనన్న వైపు ఉన్నారని, వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి పనిచేస్తామన్నారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు రాజశేఖర్ అకెపోగు రాజరత్నం, సుందర్‌రాజు, పేరపోగు రమేష్, ఎమ్మార్పీఎస్ యువజన విభాగం నాయకులు డేవిడ్ పాల్గొన్నారు.